అశ్రుధారలు

'రామ్‌చంద్'

ఎదురుగా కృష్ణ అవతల ఒడ్డునున్న జడపల్లి, షూటింగ్ అయిపోయిన తర్వాత పట్టించుకునే నాథుడు లేక బోసిపోతున్న చరిత్రాత్మక చిత్రం తాలూకు సెట్టింగ్ లాగా వుంది

వేసవికాలపు కృష్ణానది, రెండు మహా పర్వతాలమధ్య నడుస్తున్న పిల్ల కాలువవలె మెల్లగా ప్రవహిస్తూ తనలో తానేదో పాడుకుంటున్నది.

ఒడ్డు దిగాడు మూర్తి. ఎటుచూచినా వివిధాకారాల్లో వున్న నున్నటి రాళ్లు... చిన్నవి, పెద్దవి ఏదో శిథిల మహానగరాన్ని జ్ఞప్తికి తెస్తున్నవి. "నిజంగా మనవాళ్లకు వెఱ్ఱిగాని, కాకపోతే స్వభూమిలో ఏముందో గూడా తెలుసుకోక పాశ్చాత్య శిఖరాలపైకి ఎగబడుతారెందుకో!" చీకట్లలుముకున్న అతని హృదయంలో ఓ మెరుపు మెరిసింది.

కూజాలో నీళ్ళవలె దల్లగా, మోకాలులోతు గూడా లేని నదిని దాటి ఊరు చేరుకున్నాడు.

జడపల్లి!.. పూర్వం ఇచ్చట జడలు నిర్మించేవారని అందుచేత దీనికా పేరు వచ్చిందని అంటారు; కాని, నేడు జడలు నిర్మించకపోవటం అటుంచి, హైద్రాబాద్‌లో లీనమై వజీరాబాద్ అనే మారుపేరుతో ధలామణి అవుతున్నది ఒకానొకప్పుడు, రెడ్డి రాజుల కాలంలో ఇది మహానగరం. వైభవంతో తులతూగిన ఇంద్రపురం.

ఒక సంవత్సరం క్రితం మూర్తి జీవితం అప్పుడే వికసించిన పరిమళ పుష్పం నిరంతరం స్వర్గానుభూతితో తేలిపోయిన అమర సుఖం. హాయిగా జీవితమొక మధుర గానంలా, కాల వేగాన్ని గమనించక నిర్విచారంగా గడిపిన స్వప్నం.. ; కాని, నేడు - ఆ పుష్పం వాడిపోయింది స్వప్నం చెదరిపోయింది చివరకు మిగిలింది అతను, తోడుగా పుట్టెడు దుఃఖం.

మూర్తి పెదవులపైనుండి దీర్ఘమైన నిట్టూర్పు దిగజారింది

*   *   *

గుమ్మంలో వదిన ఎదురైంది నీళ్ల చెంబుతో. మాట్లాడకుండా కాళ్లు కడుక్కొని లోపలికి వెళ్లాడు హాల్లో చదువుకుంటున్న అన్నయ్య కుశలప్రశ్నలు వేశాడు ముక్తసరిగా జవాబిచ్చి దొడ్లోకి వెళ్ళాడు విస్తళ్లు కుట్టున్న ముసలమ్మ అతన్ని చూచి గుడ్లనీరు కుక్కుకుంది. అతని హృదయం చివుక్కుమంది

"ఏం నాయనా, ఇట్లా అవుతుందని ఎవరనుకున్నార్రా!" ముసలమ్మ కంఠం ఆవేదనను ఆలాపించింది.

మూర్తికి చిరాకు వేసింది. ఆవేదనతో కుమిలిపోతున్న హృదయానికి ఇదే గాబోలు ఓదార్పు! గిరుక్కున వెనుదిరిగాడు. ఎదురుగా గుమ్మంలో అన్నయ్య నిలబడి వున్నాడు తలవంచుకొని లోపలికి వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు.

"మళ్ళీ ఆ సంగతెందుకే అమ్మా, వాడు అసలే కుమిలిచస్తుంటే," దొడ్లో అన్నయ్య అమ్మమీద ఎగురుతున్నాడు

"కన్న ప్రాణంరా, కడుపుతీపి అట్లా అనిపిస్తుంది వాడి కష్టం ఒకటేనూ నా దొకటా!" అమ్మ కంఠం రుద్ధమైంది

అన్నయ్య కూతురు వచ్చి "బాబాయ్," అంటూ కాళ్లకు చుట్టుకుంది ఎత్తుకున్నాడు పిల్లను.

"బాబాయ్ . .. బాబాయ్, మరే . మరే .... పిన్నేది బాబాయ్?" వచ్చీరాని మాటల్తో అడిగింది అయిదేళ్ల ఆ పాప; ఆ లేత హృదయానికేం తెలుసు! ప్రశ్నకు సమాధానం అతని నోటివెంటైతే రాలేదుగాని, కళ్లు మాత్రం జవాబిచ్చాయ్ ..... నీళ్ళతో

"నిండు సంవత్సరన్నరగూడా కాలేదు చిలకా గోరింకల్లాగా వున్నారని ఎంతో మురిసిపోయాను ఏం లాభం! ఈ కళ్ళు పాపిష్టివి," దొడ్లో అమ్మ తన బాధను వెళ్లబోసుకుంటున్నది ఎవరితోనో.

వదిన కాఫీ తెచ్చి టేబుల్ మీద పెట్టి, తన కళ్లలోకి ఆదోవిధంగా చూచి, పాపను తీసుకొని వెళ్లిపోయింది. ప్రశాంతమైన ఆమె కళ్ళల్లో ఏమిటా బాధ.. జాలి .. తను రాకుండావున్నా బాగుండేది, వీళ్లందరికీ బాధ కల్గేదికాదు కాఫీ రుచించలా సగం తాగి గ్లాసు టేబుల్ మీద పెట్టాడు కిటికీలోగుండా దూరంగా కన్పిస్తున్న రెడ్డి రాజుల కాలంనాటి ప్రాకారం దృష్టిని ఆకర్షించింది ప్రాకారం మధ్య వున్న ఆలయశిఖరాలు తనను పిలుస్తున్నట్లు తోచింది. లేచి, కండువా పైన వేసుకొని బయలుదేరాడు

వాకిట్లో, ఎవరితోనో మాట్లాడుతున్న అన్నయ్య, "ఎక్కడికిరా ఇప్పుడు?" అనుమానంగా అడిగాడు

"కొంచెం అటు తిరిగొస్తా" అంటూనే నిష్క్రమించాడతను.

*   *   *

మిట్టలూ పల్లాలూ, రాళ్లు రప్పలూ దాటుకుంటూ, అయిదు వందల సంవత్సరాలనాటిదైనా చెక్కు చెదరక, ఆంధ్ర సామ్రాజ్య స్మృతిచిహ్నం నిల్చివున్న ప్రాకారంలోకి ప్రవేశించాడు మూర్తి

ఈ ప్రాకారంలో పూర్వం రెడ్డిరాజుల కోట లుండేవట. అసలు దీనిలో మూడు పురాలు వుండేవని, లోపలవున్న మూడు దేవాలయాలనుబట్టి వీరభద్ర, నరసింహ, అగస్త్యేశ్వరపురాలని పిలువబడేవని చెప్తారు. ఆ పురాలు, కోటలు, ఈనాడు మనకు కన్పించకపోయినా, వాటికి మూలమైన మూడు దేవాలయాలు మాత్రం నిలచి వున్నాయి

కళాకాంతులు లేక పాడుబడ్డట్లున్న వీరభద్రాలయం ముందు మూర్తి ఆగాడు ఆలయం, ఆలయంలో విగ్రహం ఈ రెండూ వున్నాగూడా దీపారాధన జరగటం లేదు

ఆలయమంతా దుమ్ము ధూళితో నిండి చూడటానికి భీకరంగా వుంది. అక్కడ నిలబడటానికి అతని మనస్సు ఒప్పుకోలేదు. మెల్లగా, ఏదారీ లేని కాలిబాటన పల్లేరుకాయలు పిచ్చి పిచ్చి మొక్కలు తొక్కుకుంటూ నరసింహస్వామి ఆలయం వద్దకు వెళ్ళాడు మహాపర్వతంలాగున్న ఆలయాన్ని చూచి అతని హృదయం గతుక్కుమంది. నిరుడీ రోజుల్లో, ఈ ఆలయంలో .

ఎందుకో అతని ఆలోచనలకు అంతరాయం కల్గింది. ముందుకు సాగిపోతూ పూజారి రాలేదు కాబోలు అగస్త్యేశ్వరాలయం మూసివుంది మరికొంచెం ముందుకు నడిచాడు మూర్తి కింద, ఓ వంద అడుగులు దిగువన, ఓవైపునుంచి మూసి, మరోవైపునుండి కృష్ణ; మూసి కృష్ణల సంగమం.

నడివేసవి ఎండలకు తట్టుకోలేక సుడుగూ

రమైన దేహం వాడిపోయిందా అన్నట్లుంది నీళ్ళు లేని మూసీనది నిర్జీవిగావున్న ప్రియురాల్ని చూచి కన్నీరు కారుస్తున్నదా అన్నట్లుంది మెల్లగా ప్రవహిస్తున్న లోతులేని కృష్ణ.

తను అంతే అయ్యాడు.. తన జీవితం అంతే అయింది; వేసవిలో ఈ రెండు నదుల సంగమంవలె ఎదురుగా మూసి లేని కృష్ణ తను సుశీ లేని మూర్తి.

నిరుడు తను సుశీ కలిసివచ్చి ఇదే ప్రదేశంలో కూర్చున్నారు. ఆనాడు రెండు నదులూ ఝరీ వేగంతో ప్రవహిస్తూ, గంభీర గానాన్ని ఆలాపిస్తూ మహదానందంతో కలుస్తున్నవి. మైమరచి పరవళ్లు తొక్కుతూ వస్తున్న మూసిని కృష్ణ హృదయానికి హత్తుకుంటున్నది.

సుశీల అంది. "మాడండి, ఈ రెండు నదుల్ని చూస్తుంటే ప్రేయసీ ప్రియులు జ్ఞాపకం రావటంలేదూ. .. ..." ఆమె అందంలో నొక్కుల్ని చూడటంలో మునిగిపోయిన తను, "ఊ" అని మాత్రం అన్నాడు.

"ఏమిటండీ పరధ్యాన! మనసెక్కడ?" చిరుకోపంతో అడిగిం దామె

"ఏమీ లేదు సుశీ. ఈ రెండు నదుల్ని చూస్తుంటే మనం వాటి ఛాయల మేమో అనిపిస్తున్నది" ఆమెను దగ్గరకు లాక్కున్నాడు

"అబ్బ ఉండండి," అంటూనే కౌగిలిలో ఇమిడిపోయిం దామె

నిజంగా ఆ మధురక్షణాలు! . .

తను కృష్ణ సుశీల మూసి. తన బాహువల్లరిలో వయ్యారాన్నొలకబోసిన సుశీ, ..

తనలో అర్ధభాగాన్ని పంచుకున్న సుశీ, తన సర్వం, తన ప్రాణం. సుశీ, తను కృష్ణుడు సుశీ—మూసీనది.

ఆనాటి కృష్ణా మూసీ నదుల వలె, తన జీవితం హాయిగా ఎటువంటి విచారం లేకుండా గడిచిపోతుం దనుకున్నాడు కాని, నేడు తను మూసిలేని కృష్ణ సుశీ లేని మూర్తి, తన జీవితం శశిలేని రాత్రి

మూర్తి కళ్లు చెమ్మగిల్లాయి లేచి నిలబడ్డాడు

"ఛీ ఈ జీవితం ఇంకెందుకు! అంతటి సుశీపోగా ఈ ప్రపంచంలో వుండి చేసేదేముంది?" ఉద్వేగంలో తన్నుతాను మర్చిపోయ్యాడు ఆత్మహత్య చేసుకోవాలనే ఆవేశమొచ్చింది ఒక్క అడుగు ముందుకు వేస్తేచాలు నూరగుడుల కిందకు, కృష్ణ మూసీనదుల సంగమస్థానంలోకి .

వెనుక ఎవరో భుజం తట్టున్నట్లుగా అగస్త్యేశ్వరాలయంలో గంట కంగారుగా మోగింది తనేం చేయబోతున్నది అతనికి తెలిసివచ్చింది వెనుదిరిగి ఆలయంలోకి వెళ్ళాడు తెల్లటి పాలరాతి శివలింగాకృతి అతని హృదయంలోకి దూసుకుపోయింది అర్ధ నిమీలిత నేత్రాలతో నిలబడి, స్వామిపై మనస్సు లగ్నంచేసి తన బాధ కొద్దిసేపు మరచాడు.

* * *

అగస్త్యమహర్షి ఈ శివలింగాన్ని ప్రతిష్ఠించాడని, అందుచేత దీనికిఅగస్త్యేశ్వరాలయమని పేరు వచ్చిందని అంటారు ఒకప్పుడు (ఎప్పుడో,) వేటగా డొకడు ఓ పావురాన్ని తరుముకుంటూ వచ్చాడని, ఆ పావురం గుడిలో దూరి శివుని శరణు వేడిందని, పావురానికి బదులుగా తన తలపైవున్న గంగను తీసుకోవలసిందిగా వేటగాని శివుడు కోరాడని, అంత వేటగాడు తన రెండు చేతుల్తోనూ పరమేశ్వరునితలపైవున్నగంగను పెకలించుకొని తీసుకొని వెళ్లాడని ఓ గాథ చెప్తారు ఈ కథ ఎంత నిజమోగాని శివ లింగంలోనికి చొచ్చుకొనిపోయిన పది వేళ్ళ చారలు నేటికీ మనకు కనిపించుతాయి ఆ చారలనుండి నిరంతరం నీరు పైకుబుకుతుంటుంది.

కొందరు ఈ కథ కేవలం కల్పితమని, నూరడుగుల క్రింద ప్రవహిస్తున్న కృష్ణానది నుండి పైనున్న శివలింగానికి యంత్రంవంటి అది అమరివుండి వుంటుందని అంటారు. ఈ రెండోదే నిజమైతే, నవీన విజ్ఞానంతో మిడిసిపడుతున్న శాస్త్రజ్ఞులు తలలొంచవలసిందేగా!

* * *

హారతి అద్దుకొని, అర్చకుడిచ్చిన ఫల పుష్పాలు తీసుకొని బయలుదేరాడు మూర్తి.

ఒకనాడు తను సుశీతోగూడా వచ్చి ఈ దేవునికి అభిషేకం చేయించాడు. ఆనాడెంత ఆనందమో ఈనాడంత విషాదం. ఆనాడు తను సుశీసమేతుడై లోకమంతా సౌఖ్యంతో కూడివుందనుకున్నాడు. ఈనాడు, భార్యా వియోగియైన తనకు లోకమంతా శోకమయంగా కన్పిస్తున్నది.

ఆనాడు అభిషేకం జరుగుతున్నది. అర్చకుడు మంత్రపుష్పం చదువుతున్నాడు. తమిద్దరు ఎంతో సంతోషంతో, శివుని కెదురుగా ముకుళిత హస్తాలతో నిలబడి, మనస్సులు పరమేశ్వరునిపై లగ్నంచేసి ఎన్నో కోరికలు కోరుకున్నారు ప్రక్కనే కూర్చుని తమిద్దరిని చూస్తున్న అమ్మ కళ్ళనుండి ఆనంద బాష్పాలు వర్షించాయి, కాని నేడవి దుఃఖాశ్రువులే అయినవి

కలత మనస్సుతో నరసింహస్వామి ఆలయం ముందుకు వచ్చాడు. లోపలకు వెళ్ళటానికి బుద్ధిపుట్టటంలేదు ఇంటికి వెళ్లటానికి కాళ్లాడటంలేదు. ఏమిటో తెలియని భయం ఎందుకో అతన్ని ఆవహించింది.

సంవత్సరం క్రితం ఈ గుడిలోనే తను సుశీలను చూచాడు. జడపల్లి చూచివెళ్దామని వాళ్లంతా అన్నయ్యగారింట్లో దిగారు. ఆమెను చూచింది మొదలు తన మనస్సంతా ఆమెపైనే లగ్నమైంది తనవాళ్ళు ఈ పెళ్ళికి ఒప్పకుంటె ఈ గుళ్లోనే వివాహం జరిపించుతానని స్వామికి మొక్కుకున్నాడు. వివాహం ఈ ఆలయంలో స్వామి సమక్షంలో జరిగింది పెళ్లిపెద్దల్లో స్వామి ఒకడు

తానైతే తనమాట చెల్లించుకున్నాడు; కాని స్వామి! తమ అన్యోన్య దాంపత్యాన్ని

సులభమైన, మెత్తని క్షౌరమునకు

కేరళ
షేవింగ్‌స్టిక్
(మిక్కిలి శ్రేష్ఠమైన తైలములనుండి తయారైనది)
స్టిక్కులు-గిన్నెసబ్బులు

కేరళ సోప్ ఇన్‌స్టిట్యూట్,
కోళికోడు
మద్రాసు ఇండస్ట్రీస్ & కామర్స్
డిపార్టుమెంటు యొక్క విభాగము
GISTA 8-53-36

★ అశ్రుధారలు ★

చూచి నిప్పులు పోసుకున్నాడు. సుఖంగా నిర్విచారంగా గడిచిపోతున్న తన జీవితాన్ని చూచి ఓర్వలేకపోయాడు.

"ఓ నరసింహస్వామీ, నీవు దయామయుడవని, భక్తులపాలిటి కల్పతరువువని, దీనబంధువని అంటారు. అంతా కల్ల. బూటకం. కేవలం నీ మొక్కులు తీర్చుకోవటానికి ఇదో తంతు...నాటకం, నీవు దేవుడవా?...కాదు. సగం మనిషివి. సగం సింహానివి. మనిషి స్వార్థపరుడు సింహం దయా దాక్షిణ్యాలు లేని అడవిమృగం ఈ రెండిటి అవతారాన్ని దాల్చిన నీవు వాటికంటే కర్కోటకుడవు నిర్దయుడవు. హృదయంలేని కఠిన శిలవు," నోటికి వచ్చినట్లు స్వామిని ఆడిపోశాడు మూర్తి. అతని దేహం జలదరించింది అప్రయత్నంగా.

ఏమిటి తను చేస్తున్న పని? దైవాన్ని తిట్టడమా? దైవ మేంచేశాడు? తన కర్మ ఇట్లా కాలింది. దానికి ఆయనేం చేస్తాడు.

మెల్లగా, అడుగులో అడుగువేస్తూ లోపలికి వెళ్లాడు దీపాల కాంతిలో స్వామి విగ్రహం తన్ను చూచి, తన చేతనాన్ని చూచి నవ్వుతున్నట్లుంది.

* * *

నరసింహస్వామి ముక్కుకు సూటిగా కొంచెం దూరంలో రెపరెపలాడుతున్న జ్యోతి వుంది. దానికి కొంచెం క్రింద నిశ్చలంగా దేదీప్యమానంగా మరో జ్యోతి వెల్గుతున్నది. ఈ స్వామి ప్రత్యక్షదైవమని ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు విడుస్తాడని, నిదర్శనం ఆయన ముక్కుకు సూటిగా రెపరెపలాడుతున్న జ్యోతేనని అంటారు.

* * *

మూర్తి దృష్టి రెండు జ్యోతులపైకి మళ్ళింది. అతనిని ఎక్కడాలేని విశ్వాసం ఆవహించింది. కాని అంతలో అనుమానం వేసింది, ఇంత ప్రత్యక్షదైవం తన సుశీని బ్రతికించలేకపోయాడేమా అని.

సుశీ! అతనికి ప్రపంచమంతా సుశీమయమైనట్లు తోచింది అతని హృదయంలోని ప్రతి అణువు సుశీ నామాన్ని పలవరించింది. సుశీ! తన సర్వం.. తన ప్రాణం...సుశీ లేదు.

సుశీ తన జీవితంలో ప్రవేశించకపూర్వం, నిలకడ నేది లేక ఏదో వెలితితో, అసంతృప్తితో దేశమంతా తిరిగాడు.

ఎచ్చటకు పోయినా, ఏచోటకు వెళ్ళినా, ఏమిటో అసంతృప్తి.. ఏదో తరుగు.

దేశం అంతా తిరిగి తిరిగి తుదకు అన్నయ్య ఉద్యోగం చేస్తున్న జడపల్లి చేరాడు. చేరిన కొద్దిరోజుల్లో సుశీ కన్పించింది. సుశీని చూచిన మరుక్షణమే తను గమ్యాన్ని చేరానని తెలుసుకున్నాడు. సంతోషంతో ఉబ్బితబ్బిబ్బైపోయాడు. సుశీని తనదాన్ని చేసుకున్న రోజున అంతవరకూ వేధిస్తున్న వెలితి తీరి జీవితం పూర్ణిమనాటి చంద్రునివలె నిండుతనాన్ని పొందింది

సుశీ తనింట్లో కాలుపెట్టిన కొద్దిరోజుల్లోనే తనకు యోగం పట్టుకుంది. పట్నంలో పెద్ద ఉద్యోగమైందని వెంటనే బయలుదేరి రావలసిందని మిత్రుడు టెలిగ్రామ్ ఇచ్చాడు సుశీనివిడిచి వెళ్ళలేక వెళ్ళలేక పట్నం వెళ్ళాడు ఓ వైపు ఉద్యోగం వచ్చిందనే సంతోషం, మరోవైపు తన సమీపంలో సుశీ లేదనే విచారం; సుఖం

మీ అభిమాన వంట పదార్థము—

మరల లభించును

పకావ్ మరల దుకాణములలోనికి వచ్చింది—దీనితో మీ భోజనము ఎక్కువ రుచిగా తయారుకాగలదు ఘన స్థితిలో నున్న వంట పదార్థమగు పకావ్ యిప్పుడు చపాతీలు లేక రొట్టెలు పైన రాయుటకు ఎంతో సులువుగా ఉంటుంది.

ప్రభుత్వ నిర్ణీత ప్రమాణములకు పూర్ణ అనుగుణ్యంగా ఉన్నది.

నేడే ఒక టిన్నును కొనుడు.

ది తాతా ఆయిల్ మిల్స్ కంపెనీ, లిమిటెడ్

లేకపోయిందతనికి. కారణంగా ఉద్యోగంలో చేరి నెల తిరక్కముందే సుశీని పట్నం తెచ్చి కాపురం పెట్టాడు.

పగలు ఆఫీసు, రాత్రిళ్లు సుశీ, శెలవుల్లో ఇద్దరూ కలసి బీచిషికార్లు, సినిమాలు దినమొక క్షణంగా ఆనందంతో గడిచిపోయింది జీవితం.

నాలుగు నెలల తర్వాత తనకు తెలిసింది అదీ, సుశీల సిగ్గుతో చెప్పలేకపోయింది ఆరోజు తను ఆఫీసునుండి ఇంటికి వెళ్లేటప్పటికి ఆమె స్వెట్టరు అల్లుతున్నది తను అడిగాడు మీకోసం కాదని అంది చిరునవ్వుతో తన బుర్ర వేగంగా పనిచేసింది తెలుసుకున్నాడు ఎంతో మురిశాడు. 'తన సుశీ బిడ్డతల్లి అవుతుందట'. అతన్ని పట్టపగ్గాలు లేకపోయినవి

ముమ్మూర్తులా సుశీని పోలిన ఆడపిల్ల కావాలని అతని వాదం. అచ్చం అతనిలా వుండే మొగపిల్లవాడు కావాలని ఆమె అభిలాష ఈ విషయంపై ఇద్దరి మధ్య ప్రణయ కలహం రేగింది తను మూతి బిగించుకున్నాడు చివరకు పోట్లాటకు మంగళహారతి పాడాలని సుశీ అంది

"మనలో మన కెందుకండి అనవసరంగా పోట్లాట మనం అనుకున్నట్లు అవుతుందా. అదేదో ఆ పరమేశ్వరుడే నిర్ణయిస్తాడు" అని

అయిదు, ఆరు, ఏడు, ఎనిమిది నెలలు గడిచాయి తొమ్మిదో నెల ప్రవేశించింది నిండు చూలాలు సుశీ రోజురోజుకు నూత్న శోభతో పరిపూర్ణ మాతృత్వాన్ని పొందబోతున్నది. ఎప్పుడూ ఆమె కెదురుగానే కూర్చుని ఏమేమిటో చెప్తూ, ఆమె అందాన్ని తనివితీరా కళ్ళతో తాగుతుండే వాడు ఆఫీసుకు పోవటానికి బుద్ధి పుట్టేది కాదు తప్పనిసరిగా వెళ్ళాల్సొచ్చేది ఆఫీసునుండి రావటం ఆమె కెదురుగా కూర్చోవటం పరిపాటైంది ఆఫీసులో కూర్చునే ఆ కొద్ది గంటలు ముళ్ళమీద వున్నట్లుండేవి

కదిత్తే ఏమౌతుందో అని ఆమెను మంచంగూడా దిగనిచ్చేవాడు కాదు ఆమె ఓవైపునుండి సిగ్గుతో బాధపడుతున్నా సేవకునిగా, ప్రాణస్నేహితురాలుగా ఉపచర్యలు చేసేవాడు వంటకు మనిషిని పెట్టాడు. ఆ శుభం జరిగిపోయేంతవరకు ఇంట్లోనే ఉండిపొమ్మన్నాడు పనిమనిషిని

పురిటికి ఇంటికి పంపవలసిందని మామగారు జాబు వ్రాశారు తన కిష్టంలేదు తను సుశీని విడిచివుండలేడు అదీగాకుండా ఆ పల్లెటూళ్లో మైక్రోస్కోపుతో వెతికినా మంచి డాక్టరు దొరకడు. ఇక్కడైతే, హాస్పిటల్లో పురుడు పోసుకుంటుందని, అత్తగార్ని పంపవలసిందని జవాబు వ్రాశాడు

ముందుగానే ఎందుకైనా మంచిదని మిత్రుడైన డాక్టరుకు చెప్పి హాస్పిటల్లో ఓ గది రిజర్వు చేయించాడు ఓ నెల రోజులు శెలవు పెట్టుదామనుకుంటూ హాస్పిటల్‌కు వెళ్ళాడా రోజు మధ్యాహ్నం పక్కింటి వాళ్లబ్బాయి రొప్పుతూ వచ్చి చెప్పాడు, అత్తయ్య పడిపోయిందని, మాటలాడటం లేదని. తన గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. మనస్సులో మనస్సు లేదు. పై ఆఫీసరుకు చెప్పాలన్న విషయంగూడా మరచి ఇంటికి పరుగెత్తాడు. ఇల్లంతా చుట్టుపక్కల వాళ్ళతో నిండివుంది. సుశీ రక్తం మడుగులోవుంది. తనకు స్మృతి తప్పింది తెలివి వచ్చేటప్పటికి అంతా అయిపోయింది.

మూర్తి విగ్రహంముందు సాష్టాంగపడ్డాడు అతని కళ్ళు బాధతో మూసుకుపోయినవి.

"స్వామీ, ప్రభూ, నా సుశీని తిరిగి నాకివ్వు. లేదా నన్ను నా సుశీవద్దకు తీసుకుపో సుశీలేని నేనెందుకు. లక్ష్మీదేవి లేకపోతే నీవేమౌతావు? ఆనాడు ఆమె వెళ్లిపోయిందనేగా, ఆమెను వెదుక్కుంటూ భూలోకంలోకి వచ్చి ఏడుకొండలపై వెలసింది. దేవుడవైన నీవే భార్యావియోగాన్ని భరించలేకపోతే, ఇహ మానవ మాత్రులం మా సంగతి వేరే చెప్పాలా!" పిల్లవానిలా మూర్తి రోదించసాగాడు

"ఎవరు నాయనా? ఏమిటి బాబూ?"

దేవుడు మాట్లాడుతున్నాడా! మూర్తి తలెత్తిచూచాడు ఋషివలె వున్న వృద్ధ పూజారి తనపాలిట దైవంలా ఎదురుగా నిల్చొనివున్నాడు

"నీవా మూర్తిబాబూ. పాపం.. లే బాబూ లే గతం గతః అన్నారు పెద్దలు అయిపోయిన దానికోసం విచారించి లాభం ఏముంది? మనం కేవలం నిమిత్తమాత్రులం మన జీవితాలు క్షణభంగురాలు ఏ నిముషానికి ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు నాయనా. జీవితం అన్న తర్వాత కష్టాలు సుఖాలు తప్పవు వెలుగు చీకట్లు లోకానికి ఎట్లాగైతే సహజమో మనకూ కష్టసుఖాలు అంతే సుఖం వచ్చిందని కేరింతలుగొట్టి లాభంలేదు. కష్టాలొచ్చాయని కుమిలి ప్రయోజనంలేదు ఎంత సుఖం వుంటుందో అంత దుఃఖం వుంటుంది ఎంత దుఃఖం వుంటుందో అంత సుఖం వుంటుంది ఇదే నాయనా ఈ జీవిత రహస్యం"

మూర్తికి హృదయంనుండి ఏదో బరువు తొలగుతున్నట్లనిపించింది. లేచికూర్చుని ఆయన పాదాలకు నమస్కరించాడు.

"తప్పు బాబూ నేనూ నీలాగే మానవుడ్ని నా భార్య చిన్నప్పుడు ఇద్దరు కూనల్ని వదిలిపోయింది ఏమిటి జీవితం అనుకున్నాను స్వర్గసుఖాన్నిచ్చిన అది లేని జీవితం ఎందుకని ఏడ్చాను. కుమిలి కృశించాను. చివరకు తెలుసుకున్నాను అందుకే ఇంతవరకూ బ్రతికి ఉన్నాను"

మూర్తి ఆయన కళ్లల్లోకి చూచాడు. అవి వింత వెలుగులతో నిండివున్నాయి

"రా నాయనా, ఇంటికి వెళ్దాం, నా ఇద్దరు పిల్లల్ని చూద్దువుగాని. ఇద్దరూ ఇంట్లోనే ఉన్నారు. పెద్దది అచ్చం తల్లి పోలిక. ఇద్దరు బిడ్డలతల్లి. దాన్ని వదిలివుండలేక అల్లుడ్ని ఇల్లరికం తెచ్చుకున్నాను. కొడుకు ఇంటర్ పూర్తిచేశాడు. నా తర్వాత ఈ గుడిలో దీపారాధన చేయవలసింది వాడే అందుకని చదువు మాన్పించాను"

మూర్తి లేచి నిలబడ్డాడు. హృదయం తేలికపడింది. అతనిముఖంలో ప్రశాంతత ప్రజ్వరిల్లింది. ఎదురుగుండా వున్న నరసింహస్వామి విగ్రహం తనకంతా తెలుసన్నట్లు చిరునవ్వుతో చూస్తున్నట్లుంది. "ప్రభూ క్షమించు తెలియక నీ స్వరూపాన్ని అపార్థం చేసుకున్నాను," మనస్సులో క్షమార్పణలు విన్నవించాడు.

బయట అలుముకుంటున్న సంధ్య చీకట్లలో, గుడిమూసిన ధ్వని వినిపించి, ముందు వృద్ధుడు, వెనుక మూర్తి ఒకరివెనుక ఒకరు కలిసిపోయ్యారు. ★

ఒకరోగి తన జబ్బేమిటో తెలుసుకోవాలని కొత్తగా ప్రాక్టీసుపెట్టిన డాక్టరు వద్దకు వెళ్లాడు. డాక్టరు చాలాసేపు పరీక్షించాడుగాని జబ్బేమిటో అంతు చిక్కలేదు.

"ఈజబ్బు మీ కిదివరకెన్నడైనా వచ్చిందా?" అని అడిగాడు.

"ఆ, రెండుమూడు సార్లు వచ్చింది."

"ఆ. అలా చెప్పండి. సరిగ్గా ఆ జబ్బే మళ్లీ ఇప్పుడూ వచ్చింది."